

నేడు 'మీ-కోసం' రద్దు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాన్ సన్నాహక కార్యక్రమాల్లో పాల్గొంటున్నందున ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. అర్జీదారులు 'మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఇదివరకే నమోదైన అర్జీల పరిస్థితిని 1100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

శివాలయాలు ముస్తాబు

- నేడు కార్తీకమాస తొలి సోమవారం



శ్రీకాకుళంలో ఉమాజఠలేశ్వరాలయానికి విద్యుత్ వెలుగులు

కార్తీకమాసం తొలి సోమవారం పూజలకు శివాలయాలు సిద్ధమయ్యాయి. జిల్లాలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం, ఉమాజఠలేశ్వరాలయం, ఎండలమల్లన్న, శ్రీముఖలింగం తదితర ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా కమిటీ సభ్యులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

8లో



పెద్దగనగళ్లవానిపేటలో ముందుకొచ్చిన సముద్రం.. ఇన్‌సెట్‌లో కోతకు గురైన తీరం

'అల'కల్లోలం

- పెద్దగనగళ్లవానిపేటలో ముందుకొచ్చిన సముద్రం
- కోతకు గురవుతున్న తీరం

శ్రీకాకుళం/రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసిపడుతున్నాయి. శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లవానిపేట తీరంలో సముద్రం ముందుకొచ్చేసింది. అలల ఉధృతికి తీరప్రాంతం కోతకు గురవుతోంది. మొంథా తుఫాన్ హెచ్చరికలతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా పడవలను ఒడ్డుకు చేర్చారు. అలాగే పెద్దగనగళ్లవానిపేట తీరం పిక్నిక్ స్పాట్ కావడంతో సందర్శకుల తాకిడి అధికంగా ఉండేది. కొన్నాళ్ల కిందట నాగావళి నది తన ప్రవాహ దిశ మార్చుకుని సముద్రం కంటే ముందరకు చేరింది. దీని వల్ల ఇక్కడ సముద్రస్నానానికి దిగకూడదని మెరైన్ పోలీసులు ప్రజలకు తెలిపేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేకాధికారి చక్రధరబాబు

మొంథా తుఫాన్‌పై అప్రమత్తం

- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి
- ఎటువంటి ప్రాణనష్టం జరగడానికి వీల్లేదు
- జిల్లా ప్రత్యేకాధికారి చక్రధరబాబు ఆదేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): 'మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి. తుఫాన్ వలన ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలి. గోల్డెన్ అవర్‌ను ఏ అధికారి వృథా చేయకుండా మెరుగైన సేవలు అందించాల'ని జిల్లా ప్రత్యేకాధికారి కేవీఎస్ చక్రధరబాబు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో మొంథా తుఫాన్‌పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ప్రతీ ఒక్కరూ అందుబాటులో ఉండాలి. గత తితలీ తుఫాన్ అనుభవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధమవ్వాలి. ప్రమాదకర ప్రాంతాల నుంచి ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలించాలి. గర్భిణులు, తీవ్ర వ్యాధులతో బాధపడుతున్న వారికి పోషకాహారం, మందులు, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి. రెవెన్యూ, పోలీసు, ఫైర్ సిబ్బంది దేనికైనా సిద్ధంగా ఉండాలి. రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్ శాఖల వారు కూలిన చెట్లను తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలి. రేషన్ డిపోలకు పీడీఎస్ బియ్యాన్ని వెంటనే పంపాలి. ప్రత్యేక శిబిరాల్లో వసతులు కల్పించాలి. అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలి. వర్షాల అనంతరం పారిశుధ్యం సవాలుగా మారుతుంది. ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మత్స్యకారుల వలలు, బోట్లు పాడవకుండా జాగ్రత్తలు వహించాలి. కంట్రోల్‌రూమ్(08942- 240557) నిరంతరం పనిచేయాలి. విద్యుత్ సరఫరా సహా అన్ని కీలక వ్యవస్థలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు. అధికారుల సూచనలను తప్పక పాటించాల'ని కోరారు.

- ఆదివారం ఉదయం ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఉరుములు, (మిగతా 8వ పేజీలో..)

పాఠశాలలకు 3 రోజులు సెలవు

మొంథా తుఫాన్ తీవ్రరూపం దాల్చనున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సోమవారం నుంచి మూడు రోజులపాటు సెలవులను ప్రకటిస్తున్నట్టు ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ తెలిపారు. అలాగే తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో జిల్లాకు సంబంధించి రూ.50లక్షల వరకు ఖర్చుపెట్టుకోవచ్చన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమవ్వాలి

- మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం కలెక్టర్, ఎస్పీ, ఇతర శాఖల అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. 'వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 28న వాయుగుండం తీవ్ర తుఫాన్‌గా మారనుంది. ఆ సమయంలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థలు సిద్ధంగా ఉండాలి. రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షించి.. అందుకు అనుగుణంగా కార్యాచరణ అమలు చేయాలి. అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి. చెరువులు, కాలువ గట్లు కోతకు గురైతే తక్షణం మరమ్మతులు చేయాలి. చెట్లు కూలినా, కొమ్మలు విరిగిపడినా తొలగించేలా చర్యలు చేపట్టాలి. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాల'ని మంత్రి అచ్చెన్న ఆదేశించారు.

- నత్తనడకన 'అమృత్ భారత్' అభివృద్ధి పనులు
- అరకొరగా సౌకర్యాలు
- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

రైల్వే స్టేషన్లలో సమస్యల కూత



పలాస రైల్వేస్టేషన్‌లో ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం ఏర్పాటు చేయాల్సింది ఇక్కడే..

పలాస/ ఇచ్ఛాపురం/నరసన్నపేట/ జలుమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అమృత్‌భారత్ పథకం కింద పలు రైల్వేస్టేషన్లలో చేపడుతున్న అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ పనులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పూర్తికావడం లేదు. తాగేందుకు నీరు ఉండదు. విశ్రాంతి తీసుకుందామంటే గదులు ఉండవు. కొన్నిచోట్ల ప్లాట్‌ఫాంలపై పైకప్పులు లేవు. మరుగుదొడ్లకు నిత్యం తాళాలు వేసి ఉంటాయి. అత్యవసర వేళ ప్రయాణికులు ఆరుబయటకు పరుగెత్తాల్సిన పరిస్థితి. కొత్త పనుల పేరిట పాత విశ్రాంతి భవనాలు, మరుగుదొడ్లు కూల్చేసిన అధికారులు వాటి స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేయలేదు. అరకొర సదుపాయాలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో వసతుల్లేవ్..

అమృత్ భారత్ పథకం కింద పలాస రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు రెండున్నరేళ్ల కిందట రూ.24.5 కోట్ల నిధులు విడుదలయ్యాయి. అయితే, ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రైల్వే స్టేషన్‌లోని రెండు ప్లాట్‌ఫాంలకు గ్రానైట్ ఫ్లోరింగ్, షెల్టర్లు వేస్తున్నారు. ఇంకా మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. ఆదాయం వచ్చే షాపులను ఏర్పాటు చేశారే తప్ప ప్రయాణికులకు అవసరమయ్యే వసతులను మాత్రం రైల్వే అధికారులు మరిచిపోయారు. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాంను టిక్కెట్ కౌంటర్ కార్యాలయానికి మార్చాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నా ఇంకా పనులు చేపట్టడం లేదు. కొత్త ఫుట్‌పాత్ బ్రిడ్జి నిర్మాణం, కొత్త ప్లాట్‌ఫాం ఏర్పాటు, స్టేషన్‌ను ఆధునికీకరించడం వంటి పనుల్లో పురోగతి లేదు. కేవలం స్టేషన్‌కు ముందు భాగంలో అరకొరగా పనులు చేపట్టారు. మొత్తం పనులు పూర్తి కావాలంటే కనీసం మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వ పాలనలో వాటిని పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇచ్ఛాపురంలోనూ అదే దుస్థితి..

ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో కూడా అమృత్‌భారత్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొత్తవి నిర్మాణం కోసం స్టేషన్‌లో ఉన్న మరుగుదొడ్లు, విశ్రాంతి భవనాన్ని అధికారులు కూల్చేశారు. వాటి స్థానంలో తాత్కాలిక ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టిక్కెట్ కౌంటర్ వద్ద కుర్చీలు లేవు. రైల్వే ఎంక్వైరీ గది స్టేషన్ లోపల ఉండడంతో రైలు సమాచారం తెలుసుకొనేందుకు ప్రయాణికులు ప్లాట్‌ఫాం టికెట్ కొనుగోలు చేసి స్టేషన్‌లోకి వెళ్లాల్సి వస్తోంది. స్టేషన్‌లో ర్యాంపులు లేకపోవడంతో దివ్యాంగులను వారి (మిగతా 8వ పేజీలో..)



తిలారు రైల్వేస్టేషన్‌లో చెట్ల కింద ప్రయాణికుల నిరీక్షణ



ఉర్లాం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాంపై పిచ్చిమొక్కలు, గడ్డి



ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో పనిచేయని డిజిటల్ బోర్డులు, పాడైన తాగునీటి కుళాయిలు

ఈ-పంట నమోదుకు గడువు పెంపు

- నెలాఖరు వరకు అవకాశం

నరసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-పంట నమోదు గడువును ఈ నెలాఖరు వరకు పొడిగిస్తూ.. వ్యవసాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ-పంట నమోదుకు గత నెల 30 వరకు తొలుత అవకాశం కల్పించారు. చాలా మంది ఈ-పంట నమోదులో వెనుకంజలో ఉండడంతో ఈ నెల 25వరకు అవకాశం కల్పించారు. క్షేత్రస్థాయిలో ఇంకా ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంతో మరోసారి ఈ నెలాఖరు వరకు గడువు పెంచారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 4,75,947 ఎకరాల్లో 3,57,289 మంది రైతులు సాగు చేశారు. కాగా, సుమారు 84 శాతం మాత్రమే ఈ-పంట నమోదు పూర్తయింది. గడువులోగా శతశాతం ప్రక్రియ పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి ఏడీఏలు, ఏవోలకు ఆదేశించారు. ఈ-పంట నమోదైతేనే పంట రుణాలపై వడ్డీ రాయితీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం, ప్రభుత్వ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేపడతామని స్పష్టం చేశారు.

ఇంకెప్పుడిస్తారో?

- వ్యవసాయ యంత్రాల కోసం రైతుల ఎదురుచూపు
- ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా కానరాని పంపిణీ
- వివరాల నమోదుకే పరిమితమైన అధికారులు

కోటబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై హార్టికల్చర్, అగ్రికల్చర్ యంత్రాలు, పనిముట్లు అందడం లేదు. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా ఇంకా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ పరికరాల పంపిణీపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వ లేదు. దీంతో రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులకు దూరమవుతున్నారు. కూలీల కొరత నేపథ్యంలో అన్నదాతలు వ్యవసాయ పనులకు యంత్రాలు, పనిముట్లపై ఆధారపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రైతులకు ఎలాంటి పరికరాలు అందించలేదు. క్లస్టర్ హైరింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి వైసీపీకి అనుకూలమైన వారికి మాత్రమే వాటిని అందజేశారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.60కోట్ల నుంచి రూ.80కోట్ల వరకు రాయితీ పరికరాలను పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరికరాల పంపిణీపై స్పష్టత కరువైంది. గత ఏడాది కూడా చివర్లో నామమాత్రంగా పరికరాలు పంపిణీ చేశారు. ఈ ఏడాది ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, పవర్‌టిల్లర్లు, వీడర్లు, టార్పాలిన్లు, రోటావేటర్లు, కోత యంత్రాలు, స్ప్రేయర్లు, దమ్ము సెట్, దుక్కు సెట్ తదితర వ్యవసాయ యంత్ర, పరికరాలను సబ్సిడీపై రైతులకు అందించాల్సి ఉంది. కానీ, ఇంతవరకు ఆ ఊసే లేదు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన ఎఫ్ఎం (ఫాం మెకనైజేషన్) యాప్‌లో రైతుల వద్ద ఏయే వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉన్నాయి.. ఇంకా ఏవి అవసరం.. ప్రస్తుతం ఉన్నవి రాయితీపై ఇచ్చినవా.. రైతులు సొంతంగా కొనుగోలు చేసినవా? అనే వివరాలు రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తున్నారు. అవసరాలకు అనుగుణంగా యంత్రాలు, పనిముట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తారని వారు చెబుతున్నా ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. ఇప్పటికే యంత్రాలు, పనిముట్ల పంపిణీలో జాప్యం కావడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు. మరికొన్ని రోజుల్లో (మిగతా 7వ పేజీలో..)



లఖందిడ్డిలో వరి సాగుకు స్ప్రే చేస్తున్న రైతు



అరసవల్లిలో బారులుదీరిన భక్తులు

ఆదిత్యుని దర్శనానికి పోటెత్తిన భక్తజనం

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆదివారాన్ని పురస్కరించుకుని.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. ఆరోగ్యప్రదాత అరసవల్లిలోని ఆదిత్యుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఇంద్రపుష్కరిణిలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు స్వామికి రూ.9,64,758 ఆదాయం లభించింది. టిక్కెట్ల ద్వారా రూ.6,04,500, పూజలు, విరాళాల ద్వారా రూ.74,508, ప్రసాదాల రూపంలో రూ.2,85,750 ఆదాయం సమకూరింది.

శివాలయంలో నాగుపాము



పలాస రూరల్/కాశీబుగ్గ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పలాస మండలం కాశీబుగ్గ పాత జాతీయరహదారి వద్ద గల లోకనాథేశ్వర ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం ఓ నాగుపాము దర్శనమిచ్చింది. ఆలయంలోని నంది మండపం నుంచి గర్భ గుడిలోకి ప్రవేశించి శివలింగం వద్ద ఉన్న ఇత్తడి సర్పపీఠం పక్కనే పడగ విప్పింది. దీనిని అర్చకులు ప్రకాష్, సారథి గమనించారు. స్నేక్ క్యాచర్ ఓంకార్ త్యాడికు సమాచారం అందించారు. ఆయన అక్కడికి చేరుకుని చాకచక్యంగా పామును పట్టి మెండు అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

దానాల్లోకెల్లా రక్తదానం గొప్పది

● ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి



ఘట్‌కేసర్‌లో రక్తదానం చేస్తున్న యువకులతో మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):అన్ని దానాల్లోకెల్లా రక్తదానం ఎంతో విలువైందని, గొప్పదని ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని సెయింట్ ఆంథోనీస్ పాఠశాలలో నిర్వహించిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. సాధారణంగా ఒక వ్యక్తి రక్తదానం చేయడం వలన ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణం పోస్తు ందని అన్నారు. రక్తదానంపై అపోహలు వీడాలని కోరా రు. ఒక వ్యక్తి సంవత్సరంలో నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చని వివరించారు. రక్తదానంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. కేవలం రెండు మూడు రోజు ల్లో శరీరంలో పోయిన రక్తం సమకూరుతుందన్నారు. ఇందుకు పండ్లు, ఆకు కూరలు, పాలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అయితే రక్తదానం ఒకరికి ప్రాణదానం అవుతుంది కనుక యువత రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా 55 మంది రక్తదానం చేశారు. శివానంద పిడియాట్రిక్ క్యాన్సర్ సెంటర్ బృందం రక్తాన్ని సేకరించింది. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి, మాజీ కౌన్సిలర్ జహంగీర్, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి



సదర్ వేడుక పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంకర్, సంఘం నాయకులు

షాద్‌నగర్ అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలకు అతీతంగా యాదవ పండుగైన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్‌లోని క్యాంప్ ఆఫీసులో ఆదివారం సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సదర్ ఉత్సవ పోస్టర్ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తుచేశారు. షాద్‌నగర్ మెయిన్ రోడ్డులో నవంబరు 2న నిర్వహించ తలపెట్టిన సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు యాదవులంతా ఏకతాటిపైకి రావాలని కోరారు. కష్టజీవులైన యాదవులు రాజకీయాలకు అతీతంగా, మాటకు కట్టుబడి ఉండేవారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో ఓటు బ్యాంకు రాజకీయ కోసం యాదవులను విచ్ఛిన్నం చేశారని ఆరోపించారు. పార్టీలు ఏమున్నా.. ఐకమత్యంతో ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు వై.యాదయ్యయాదవ్, రాఘునాథ్‌యాదవ్, ఎన్.యాదగిరి, బి.అంజయ్య, షాబాద్ మల్లేష్‌యాదవ్, నక్క బాల్‌రాజ్, మాధవులు, పసుల నర్సింహ, తుమ్మల నర్సిహ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్?

● నేడు ఉత్తర్వులు అందజేయనున్న ఎంఈవో

తాండూరు రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):కరన్‌కోట్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన సైన్స్ ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు సోమవారం(నేడు) ఉత్తర్వులు అందజేస్తామని ఎంఈవో వెంకటయ్య ఆదివారం తెలిపారు. కరన్‌కోట్ జెడ్పీ పాఠశాలలో ఓ బాలిక పట్ల సైన్స్ ఉపాధ్యాయుడు రాఘవేందర్‌రెడ్డి ఈ నెల 22న పాఠశాలలో అసభ్యకరంగా ప్రవర్తించడంతో ఈ విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంటనే కరన్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు ఎంఈవో వెంకటయ్య పాఠశాలలో విచారణ జరిపారు. నివేదికను డీఈవోకు అందజేశారు. నివేదిక ఆధారంగా సదరు టీచర్ తప్పు చేసినట్టు నిర్ధారించి డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. ఉత్తర్వులను సోమవారం ఉపాధ్యాయుడికి పాఠశాలలో ఇస్తామని ఎంఈవో తెలిపారు.

ఘనాపూర్‌లో భక్తి శ్రద్ధలతో మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం



స్వామి వారి కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్-మమత దంపతులు, గ్రామస్తులు

ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లో ఆదివారం మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కాంగ్రెస్ బి-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేశ్‌గౌడ్ నివాసంలో ఒగ్గు కళాకారుల ఆటపాటల మధ్య మల్లన్న కల్యాణాన్ని జరిపించారు. ఈ కార్యక్రమంలో మహేశ్‌గౌడ్-మమత దంపతులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పీర్జాదిగూడ మాజీ డిప్యూటీ మేయర్ రవిగౌడ్, బొక్క ప్రభాకర్‌రెడ్డి, అర్జున్, నాయకులు బాలగొని నర్సింహాగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, బొక్క సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కప్పేసిన చెట్లు

● రూ.6వేల సొంత డబ్బు వెచ్చించి నరికివేయించిన పోలీసులు
● ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్న రక్షక భటులు
● పోలీసుల సాయంపై తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామస్తుల హర్షం



నాగార్జున సాగర్ రహదారి నుంచి తక్కళ్లపల్లి వరకు ఉన్న రోడ్డుపైకి వచ్చిన చెట్లను తొలగింపజేస్తున్న పోలీసులు

యాచారం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి నుంచి తక్కళ్లపల్లి-కొత్తపల్లి గ్రామాలకు వెళ్లే దారిని రోడ్డుకిరువైపుల భారీ చెట్లు రోడ్డును ఆక్రమించాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కన్పించకుండా చెట్లు రోడ్డును కమ్మేశాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయం గమనించిన యాచారం సీఐ ఏ.నందీశ్వర్‌రెడ్డి, ఎస్సైలు యు.మధు, ప్రియాంకలు తమ సిబ్బందితో రోడ్డును ఆక్రమించిన చెట్లను ఆదివారం నరికివేయించారు. పోలీసులు సొంతంగా రూ.6వేలు వెచ్చించి ఎక్స్‌కవేటర్‌తో చెట్లను నరికి వేయించారు. ఆరు కిలోమీటర్ల వరకు రోడ్డును ఆక్రమించిన చెట్లన్నింటినీ నరికి వేయించారు. అలాగే రోడ్డు పక్కన మట్టిపోయించి చదును చేయించారు. పోలీసులు తమ గ్రామాలకు వెళ్లే రోడ్డును ఆక్రమించిన చెట్లను తొలగించి మేలు చేశారని తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ పోలీస్ అధికారి కూడా ఇలాంటి పనులు చేయించలేదని, నేడున్న సీఐ, ఎస్సైలు ప్రజల సమస్యలను తీర్చడం ప్రశంసనీయమని ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డును కప్పేస్తున్న చెట్లను తొలగిస్తున్న పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లు



షెడ్ల నిర్మాణానికి భూమిపూజ



షెడ్డు నిర్మాణ భూమిపూజలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నాయకులు

దుద్యాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలెపల్లి రేణుక ఎల్లమ్మ ఆలయం పక్కన మటన్(కబేళా) షెడ్డు నిర్మాణానికి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్, ఆలయ చైర్మన్ జయరాములు ఆదివారం భూమిపూజ చేశారు. రూ.30లక్షలతో షెడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, సింగర్ నరసింహ, చంద్రయ్య, నరసింహ, కృష్ణ, వెంకటయ్యగౌడ్, యాదయ్యగౌడ్, ముస్తాక్, కొండయ్య, వెంకటయ్య, సాయిలుగౌడ్, రాములు, భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎల్వోసీ అందజేత



ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం ఎల్వోసీలను అందజేశారు. యాలాల మండలం పగిడ్యాలకు చెందిన రాస్నం అరుణకు సీఎంఆర్ఎఫ్ కింద రూ.2లక్షలు, పెద్దేముల్ మండలం రుద్రారానికి చెందిన లలితకు రూ.2.25లక్షల ఎల్ఓసీని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, నాయకులు లొంక నర్సిములు, ఉప్పరి మల్లేశం తదితరులు ఉన్నారు.

సాంకేతిక బోధన అందించాలి



ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని సందర్శించిన అరుణ

పరిగి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):ఓపెన్ స్కూల్ విద్యార్థులకు సాంకేతిక బోధనను అందించాలని టీవోఎస్ఎస్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ అరుణ అన్నారు. ఆదివారం పరిగిలోని జడ్పీహెచ్ఎస్ నం.1, 2స్కూళ్లలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి వారం నిర్వహించే తరగతులకు క్రమం తప్పక హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు పాఠాలు వింటేనే పరీక్షలు రాయగలుగుతారని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలు అందుబాటులో లేని కారణంగా పరీక్షలు రాయలేకపోతున్నామని, నియోజకవర్గ కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఈవో గోపాల్, టీచర్లు పాల్గొన్నారు.


అధ్యాపకుడికి యువ ఆచార్య అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న సీఎంఆర్ అధ్యాపకుడు జి.మధుకర్

మేడ్చల్ టౌన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషన్ ఎక్స్‌లెన్సీ పురస్కారంలో భాగంగా సీఎంఆర్ కళాశాల అధ్యాపకుడు మధుకర్‌కు యువ ఆచార్య అవార్డు దక్కింది. అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) స్టేట్ కోఆర్డినేటర్ బుద్ధ చంద్రశేఖర్ నుంచి అవార్డు అందుకున్నారు. సాంకేతిక విద్య బోధనతో పాటు, విద్యారంగంలో పరిశోధనల పట్ల ప్రతిభ కనబర్చే అధ్యాపకులకు బ్రోయినో విజన్ సంస్థ అవార్డులను అందజేస్తోంది. ఈ సందర్భంగా సీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అభినవ్‌రెడ్డి, డైరెక్టర్ ఎ.రాజిరెడ్డి, డీన్ భాస్కర్ తదితరులు మధుకర్‌కు అభినందనలు తెలిపారు.

పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా?



నరేందర్‌రెడ్డి

కేశంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకపోతే ఎలా? అని బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కోకన్వీనర్ కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కేశంపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం హైదరాబాద్‌లో సెల్‌ఫోన్ దొంగతనం చేసి పారిపోతున్న ఇద్దరు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించిన డీసీపీ చైతన్యకుమార్, ఆయన గన్‌మన్ మూర్తిలపై దొంగలు కత్తితో దాడి చేశారని తెలిపారు. పోలీసులపై దాడిని ఖండిస్తున్నామన్నారు. నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్ హత్య, అలాగే హైదరాబాద్ సమీపంలో గోరక్షక్‌పై కాల్పులు జరిగాయన్నారు. రాష్ట్రంలో లాఅండ్‌ఆర్డర్ గతి తప్పుతోందని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రాష్ట్రంలో వెంటనే హోంశాఖ మంత్రిని నియమించి శాంతి భద్రతలను పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

అప్రమత్తంగా ఉండండి

● కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

గుజరాతీపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాన్ ప్రభావం జిల్లా వ్యాప్తంగా ఈనెల 28, 29 తేదీల్లో ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వర్షాలతోపాటు సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దన్నారు. తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు చేపట్టాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. విద్యుత్, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు. జిల్లాలో పరిస్థితులపై అధికారులతో ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, సహాయక చర్యల కోసం బృందాలు కూడా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో శ్రీకాకుళం కంట్రోల్ రూమ్ 08942-240557 నెంబరులో సంప్రదించాలని ఆ ప్రకటనలో కోరారు.

సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు

● డీఎస్పీ సీహెచ్ వివేకానంద


బందరువానిపేటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద

గార/శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని డీఎస్పీ సీహెచ్ వివేకానంద సూచించారు. ఈ మేరకు ఆదివారం బందరువానిపేట, నగరాలపేట, కళింగపట్నం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. తుఫాన్ ప్రభా వంతో ఈదురుగాలులు, వర్షాలు పడే అవకాశం ఉందని, ఎవరూ సముద్రతీరంలోకి వెళ్లవద్దన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలిచ్చారు. మత్స్యకారులు చేప ల వేటకు వెళ్లవద్దన్నారు. పోలీస్, రెవెన్యూశాఖ అధి కారులు అందుబాటులో ఉంటారని అత్యవసర పరిస్థితు ల్లో వెంటనే జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 112 లేదా స్థానిక పోలీస్ అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, గార ఎస్ఐ గంగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలో పలు సముద్ర తీర గ్రామాల్లో సీఐలు, ఎస్ఐలు పర్యటించి ప్రజలు, మత్స్యకారులను అప్రమత్తం చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కవిటి బీచ్‌రోడ్డులో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆల యానికి ఆదివారం దాతలు విరాళం అందించా రు. ఆలయ గాలిగోపురం నిర్మాణానికి బి.శ్రీని వాసరావు, టి.రవి కుటుంబసభ్యులు రూ.10 వేలు చొప్పున, జి.రాంబాబు, టి.ఉమామహేష్ రూ.5 వేలు చొప్పున సాయాన్ని అందించారు. ఆలయ ధర్మకర్త బీపీ రెడ్డి, పి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అమ్మవార్లను తాకిన సూర్యకిరణాలు


అమ్మవార్ల విగ్రహాలపై పడిన సూర్య కిరణాలు

కంచిలి/సోంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కంచిలి, సోంపేట మండలాల్లో ఆదివారం అమ్మవార్ల మూలవిరాట్‌లకు సూర్య కిరణాలు తాకి భక్తులకు ఆనందం కలిగించాయి. కంచిలి మండలం కర్తలి గ్రామదేవత మహాలక్ష్మి అమ్మవారు, సోంపేట పట్టణం కన్యకపరమేశ్వరి అమ్మ వార్లకు ఆదిత్యుడు తన లేలేత కిరణాలు తాకడంతో ఆయా గ్రామాల ప్రజలు తిలకించి తనివితీరా దర్శించుకుని తరించారు.

పెట్టుబడులకు వేదికగా విశాఖ: ఎంపీ కలిశెట్టి

న్యూఢిల్లీ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో విశాఖ పెట్టుబడులకు వేదికగా మారబోతోందని ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. ఢిల్లీలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నంలో నవంబరు 14, 15 తేదీలో జరిగే పారిశ్రామిక సదస్సు. పెట్టుబడులు తెచ్చేందుకు, వాటికి సంబంధించిన ఒప్పందాలు కుదుర్చు కునేందుకు వేదిక కాబోతోందన్నారు. అమరావతి, విశాఖపట్నం ఒకేలా అభివృద్ధి చెందాలని సీఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్టు వివరించారు. అలాగే ఐటీ మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించి పెట్టుబడులకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. జగన్ పాలనలో సంస్థలన్నీ తరలి వెళ్లిపో యాయని గుర్తు చేశారు. రాష్ట్రానికి కంపెనీలు రాకుండా అడ్డుకునేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

కొనసాగిన క్విస్కిల్ ఫాల్ ఫెస్ట్

ఎచ్చెర్ల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్‌లో ఈనెల 21 ప్రారంభ మైన క్విస్కిల్ ఫాల్ ఫెస్ట్-2025 ఆదివారం ఆరోరోజు కొనసాగింది. సోమవారంతో ఈ ఫెస్ట్ ముగియనుంది. ఈ సందర్భంగా క్వాంటమ్ రీసెర్చ్ సైంటిస్ట్ (న్యూయార్క్) డాక్టర్ రితజిత్ ముజుం దార్ మాట్లాడుతూ.. క్వాంటమ్ ద్వారా అనేక మార్పులు తీసుకురాగలమని చెప్పారు. క్వాంటమ్ సూత్రాల ప్రయోగాత్మక అన్వయాలు, భవిష్యత్ లో సాంకేతిక రంగంలో వాటి పాత్ర అనే విషయాలను వివరించారు. డేటా టెక్ సీఈవో డాక్టర్ జ్ఞాన్ ఎల్లా, శ్రీనివాస పీసుపాటి, క్వాంటమ్ కంప్యూ టింగ్ ఇంజనీర్ తిలోక్ సాధుఖాన్ ఆధ్వర్యంలో హ్యాకథాన్ నిర్వ హించారు. విద్యార్థులు సృజనాత్మక ఆలోచనలతో క్వాంటమ్ సమస్యలపై పరిష్కారాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

గుజరాతీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నవంబరు ఒకటవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు లు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు తెలిపారు. యూటీఎఫ్ భవనంలో ఆదివారం జన విజ్ఞాన వేదిక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కె.అప్పారావు, బి.మోహన రావు, బి.జనార్దనరావు పి.కూర్మారావు, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షురాలు బి.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలోనే ఉంచాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. పలు ప్రజా సంఘాల నేతలు, పలువురు మేధావులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకెప్పుడిస్తారో?

(ఐదో పేజీ తరువాయి)

వరి కోతలు ప్రారంభంకానున్నాయి. వీటికి కోత యంత్రాలు అవసరం. అలాగే, వర్షాలు కురిస్తే పంటను కాపాడుకోవడానికి టార్పాలిన్లు కావాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో రాయితీపై యంత్రాలు, పనిముట్లను అధికారు లు అందించాలని రైతులు కోరుతున్నారు.

ఆయిల్ ఇంజన్ అందజేయాలి..

నేను రెండు ఎకరాల్లో కూరగాయలు సాగు చేస్తున్నా. వాటికి సాగునీరు అందించేందుకు ఆయిల్ ఇంజన్ అవసరం. దీని ధర బయట మార్కెట్‌లో రూ.25వేల పైగా ఉంది. గత టీడీపీ ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు రూ.10 వేలకే అందించింది. ఇంజన్ కోసం కొన్ని నెలలుగా మండల వ్యవసాయ కార్యాలయానికి తిరుగుతున్నా. వచ్చినప్పుడు ఇస్తామని అధికారులు చెబు తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై అందించాలి.

-నేతింటి చిన్నబాబు, ఊడికలపాడు, కోటబొమ్మాళి

నివేదిక పంపించాం..

ఆయిల్ ఇంజన్లు, స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు కావాలని ప్రతిరోజూ రైతులు కార్యాలయానికి వస్తున్నారు. వారి పేర్లను నమోదు చేసుకొని ఆ వివరాలు ఉన్నతాధికారులకు అందజేశాం. యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు కార్యాలయానికి వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తాం.

-ఎస్.గోవిందరావు, మండల వ్యవసాయాధికారి, కోటబొమ్మాళి

శ్రీకూర్మనాథుని దర్శించుకున్న భక్తులు

గార, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి ఆదివారం సందర్భంగా ప్రసిద్ధ శ్రీకూర్మ నాథుని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలతో శ్రీకూర్మంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. శ్రీకూర్మనాథుని దర్శించుకున్న భక్తుల వాహనాల కోసం ప్రత్యేకించి పార్కింగ్ సౌకర్యం కల్పించాలని దూర ప్రాంతాల భక్తులు ఆలయ అధికారులను కోరుతున్నారు. ● శ్రీకూర్మం క్షేత్రంలో ఆదివారం దేవస్థానం ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గిరీష్, జ్యోత్స్న తదితరులు రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడకు ప్రోత్సాహం

● ఇండోర్‌లో ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్ క్రీడను రాష్ట్రంలో పాఠశాల స్థాయి నుంచి విస్తరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే, పీయూ సీ రాష్ట్ర చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో సాఫ్ట్‌బాల్ అసోసియే షన్ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. అసోసియేషన్ జాతీయ అధ్య క్షుడు రమేష్ మండోల్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కూన రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

చర్చి ఫాదర్ జాన్‌రత్నం మృతి

రణస్థలం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబ్ల్యూఎంఈ పెంటెకోస్టల్ చర్చి ఫాదర్ జాన్‌రత్నం (86) అనారోగ్యంతో విశాఖపట్నంలో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన పార్థివ దేహానికి అంతిమయాత్ర నిర్వహించారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులున్నారు. పలువురు శిష్యులు, గ్రామస్థులు అంతిమయాత్రలో పాల్గొని నివాళి అర్పించారు.

ఏడీఆర్‌ఎంకు అభినందన

సోంపేట రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా నియమితులైన కుంద రామారావును ఎర్రముక్కాం గ్రామ సంఘం, నీలకంఠేశ్వర ఆలయ సేవా కమిటీ సభ్యులు అభినందిం చారు. ఆదివారం విశాఖలో ఆయనను కలిసి శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు పొట్టి రాజ్‌కుమార్, సూరాడ చంద్రమోహన్, బైపల్లి పాపారావు, ఎంపల్ల ముకుంద రావు, కోనేటి జగన్ పాల్గొన్నారు.

శివాలయాలు ముస్తాబు

- నేడు కార్తీక తొలి సోమవారం
- ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

కార్తీకమాసం శివుడికి ప్రీతికరం. అందులోను తొలి కార్తీక సోమవారం భక్తులకు మరింత అపురూపం. ఆ దేవదేవుని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు.




అరసవల్లి: అలంకరణలో ఉమారుద్రకోటేశ్వర స్వామి, ఏర్పాటు చేసిన బారికేడ్లు



జలుమూరు: శ్రీముఖలింగేశ్వరాలయం

శ్రీకాకుళం నగరంలో..

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని అతి పురాతనమైన ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయాన్ని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. నాగావళి నదిలో భక్తులు దీపాలు విడిచిపెట్టే చోట శుభ్రం చేసి, లైట్లను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే శివాలయాలకు భక్తుల తాకిడి మొదలయింది. నక్కవీధిలోని ఉమా జఠలేశ్వరస్వామి, పాలకొండ రోడ్డులోని రామలింగేశ్వర స్వామి ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.



టెక్కలి రూరల్: ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో..

ఎండల మల్లన్న ఆలయంలో..

టెక్కలి రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మొదటి సోమవారం కావడంతో రావివలస ఎండల మల్లికార్జున స్వామి భక్తులు దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. టెక్కలి నుంచి రావివలస వరకు రోడ్లు పరిశుభ్రంగా చేశారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉండడంతో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండొచ్చని ఈవో గురునాథ్ అన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో..

జలుమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ప్రాంగణంలో బారికేడ్లు, ఎండ నుంచి రక్షణకు షామియానాలు ఏర్పాటు చేశారు. ఉచిత దర్శనంతోపాటు ప్రత్యేక దర్శనాలకు ఏర్పాట్లు చేశారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు అచ్యుతాపురం వైద్యాధికారి పూజారి సుజాత తెలిపారు. ● సామాన్య భక్తులకు శ్రీఘ్రంగా స్వామి దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ బీవీవీ ప్రసాద్ పట్నాయక్ ఆదేశించారు. ఆలయంలో చేసిన ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆలయ ఈవో ఏడుకొండలు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

కుటుంబ పోషణ కోసం వలస వెళ్లి

- అబుదాబిలో గెద్దలపాడు వాసి మృతి
- మృతదేహాన్ని తెప్పించాలంటూ భార్య వేడుకోలు



నరసింహారావు (ఫైల్)

కంచిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గెద్దలపాడు గ్రామానికి చెందిన నక్క నరసింహారావు(49) అనారోగ్యంతో అబుదాబీలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. నరసింహారావు నెల రోజుల కిందట అబుదాబీలో ఎన్‌ఏఎస్‌హెచ్ కంపెనీలో వెల్డర్‌గా పనికి వెళ్లాడు. బుధవారం సాయంత్రం భార్యకు ఫోన్ చేసి తనకు కడుపునొప్పిగా ఉందని, ఆసుపత్రికి వెళుతున్నానని చివరిసారిగా మాట్లాడాడు. శుక్రవారం అర్ధరాత్రి కంపెనీ నుంచి నరసింహారావు మృతి చెందినట్టు సమాచారం ఇచ్చినట్టు భార్య నారాయణమ్మ తెలిపారు. నరసింహారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడు మాదవ్ మానసిక వికలాంగుడు. చిన్నకుమారుడు నీరజ్ ఐటీఐ చదువుతున్నాడు. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉందని నెల రోజుల కిందట అప్పులు చేసి అబుదాబి వెళ్లిన నరసింహారావు ఇంతలోనే మృతి చెందిన విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. తన భర్త మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె ఎమ్మెల్యే బెందాళం అశోక్, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయిడు, అధికారులను వేడుకుంటోంది.

బావిలో పడి యువకుడి మృతి

కోటబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి పంచాయతీ ఉప్పరపేట గ్రామానికి చెందిన దండుపాటి గౌరినాయుడు (32) ఆదివారం బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గౌరినాయుడు మద్యం మత్తులో స్నానానికి బావిలో దిగి మునిగిపోయి పోయాడు. దీనిని గమనించిన కొందరు గ్రామస్థులు అతడిని పైకి తెచ్చి 108కి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది అతడిని పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు. గౌరినాయుడికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



సూర్యనారాయణ (ఫైల్)

నరసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కోమర్తి గ్రామానికి చెందిన బిశెట్టి సూర్యనారాయణ (40) విశాఖ కేజీహెచ్‌లో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 25న కోమర్తి వద్ద ప్రమాదవశాత్తు పడి పోయిన సూర్యనారాయణను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. మెరుగైన వైద్యంకోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి తల్లి త్రినాథమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ చెప్పారు.

సారాతో ముగ్గురి అరెస్టు

సోంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ఆటోలో సారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. పక్కా సమాచారంతో మందస మండలం దేవుపురం జంక్షన్ వద్ద తనిఖీ చేస్తుండగా కడ్డాల రాజారావు తన ఆటోను ఆపకుండా వెళ్లిపోయాడు. దీంతో అప్రమత్తమైన సిబ్బంది గుణకర్, భానుప్రసాద్ వెంబడించి పట్టుకొని తనిఖీ చేశారన్నారు. రెండు ప్లాస్టిక్ గోనె సంచుల్లో 50 లీటర్ల సారా ఉండడాన్ని గమనించి ఆటోలో ప్రయాణిస్తున్న పిడిమందసకు చెందిన కడ్డాల రాజారావు, ఇప్పిలి ఉమా మహేష్, అగ్గున నారాయణరావులను అదుపులోకి తీసుకుని సారాను స్వాధీనం చేశామన్నారు. కేసు నమోదు చేశామని, ఈ దాడుల్లో ఎస్ఐ జగన్నాథ్, మార్కారావు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

కవిటి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కె.కపాసుకుద్ది గ్రామ సమీపంలోని తోటలో ఆదివారం పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.రవివర్మ తెలిపారు. తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. నలుగురు పేకాటరాయుళ్ల నుంచి రూ.2010 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అవయవ దానంతో స్ఫూర్తి



హిమవతి (ఫైల్)

సోంపేట రూరల్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మాకన్నవరం గ్రామానికి చెందిన ఉలాల హిమవతి (33) రెండు రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ బ్రెయిడ్ డెడ్ అయింది. ఈ నేపథ్యంలో ఆమె అవయవాలను దానం చేసేందుకు భర్త వెంకటరావు, కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. ఆమె కళ్లు, మూత్ర పిండాలు, ఊపిరితిత్తులు, హృదయం తదితర అవయవాలు దానం చేసి ఇతరుల్లో స్ఫూర్తి కలిగించారు. వీటిని శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి అందించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రూ.2.63 లక్షలు సాయం

కోటబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చలమయ్యపేట గ్రామానికి చెందిన సైన వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న పాల పోలమ్మతల్లి కమిటీ సభ్యులు రూ.2.33 లక్షలు, అలాగే మరి కొంతమంది రూ.30వేలు సాయంగా అందజేశారు. ఈ మొత్తం రూ.2.63 లక్షలు వెంకట్ కుటుంబానికి గ్రామపెద్దల సమక్షంలో ఆదివారం అందజేశారు. కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పనితోనే తగిన గుర్తింపు

పలాస, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): చేసిన పనులతోనే తగిన గుర్తింపు లభిస్తుందని ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆడిటోరియంలో పలాస డివిజన్‌లో కొత్తగా విధుల్లో చేరిన వ్యాయామ ఉపాధ్యాయుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయుడు, సంఘ జిల్లా అధ్యక్షుడు మెంటాడ సాంబమూర్తి దంపతులకు జోనల్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ఆధ్వర్యంలో సత్కరించారు. రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ఉపాధ్యక్షుడు ఎ.శేఖర్‌బాబు, జిల్లా పీఈటీల సంఘ అధ్యక్షుడు పి.తవిటయ్య, సీనియర్ పీఈటీలు కె.రాజారావు, కె.పద్మనాభరెడ్డి, పి.గజేంద్రరావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

గుజరాతీపేట, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఏడు రోడ్ల కూడలిలోని ప్రెస్‌క్లబ్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా చల్లా సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా అంపోలు షన్ముఖరావు, జిల్లా సహాధ్యక్షుడిగా బి.శేఖర్, ట్రెజరర్‌గా వై.శ్యామ్‌సుందర్‌తో సభ్యులను ఎన్నుకున్నారు.

మొంథా తుఫాన్‌పై అప్రమత్తం

(ఐదో పేజీ తరువాయి)

మెరుపులతో.. గంటకు 65 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీయనున్నాయి. ఈ గాలుల వేగం క్రమేణా పెరిగి గంటకు 110 కి.మీ. చేరుకునే అవకాశముంది. తుఫాన్ ప్రభావంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల'ని ఆదేశించారు. ఈ నెల 29 వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదన్నారు. వరిపంట కోతదశలో ఉన్నట్లయితే ఎవరూ కోత కోయరాదని, ఇప్పటికే కోసిన పంటను భద్రపరచాలని సూచించారు. తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఇప్పటికే జిల్లాకు చేరుకుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ఎంజీఆర్



రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం/రూరల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఢిల్లీలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో అభివృద్ధికి కావాల్సిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. అనంతరం ఢిల్లీ పర్యాటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలుసుకున్నారు. అలాగే ఢిల్లీలో ఆదివారం జరిగిన పౌర విమా నయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రావ్య దంపతుల కుమారుడు శివాన్ ఎర్రన్నాయుడి బారసాల మహోత్సవంలో పాల్గొన్నారు.

తెలంగాణ సీఎంతో జిల్లా ప్రజాప్రతినిధులు



రేవంత్‌రెడ్డితో ఎమ్మెల్యేలు రమణమూర్తి, శంకర్, ఎమ్మెల్సీ గ్రీష్మ, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

నరసన్నపేట/అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి కుమారుడి బారసాల కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ వెళ్లిన నరసన్నపేట, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ ఆదివారం ఇదే కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. టీడీపీలో ఉన్న సమయంలో రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

బాలియాత్రను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జలుమూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగం దివ్యక్షేత్రంలో గల మధుకేశ్వరస్వామి సన్నిధిలో వచ్చే నెల 9న చేపడుతున్న బాలియాత్రలో అన్ని వర్గాల ప్రజలు, భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యుడు డి.జీవితేజేశ్వరరావు కోరారు. దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరాలయంలో ఆదివారం బాలియాత్రకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చేనెల 9వ తేదీన ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు బాలియాత్ర ప్రారంభమవుతుందన్నారు. వంశధార నదిలో తెప్పోత్సవ దీపారాధనతో పాటు పితృదేవతలకు తర్పణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపిటీసీ కరుకోల హరిప్రసాద్ పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హడ్కో కాలనీలో కార్డన్ సెర్చ్

నరసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక హడ్కోకాలనీలో పోలీసులు ఆదివారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీల్లో అనుమానిత వ్యక్తులు నివశిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఉన్న ఎనిమిది ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్‌లో...



కోటబొమ్మాళి: వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక మేజరు పంచాయతీ పరిధి ప్రకాష్‌నగర్ కాలనీలో ఆదివారం వేకువజామున ఎస్ఐ వి.సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి పత్రాలు లేని తొమ్మిది ద్విచక్ర వాహనాలు స్వాధీనంకున్నారు. ఈ సందర్భంగా కాలనీ యువకులతో ఎస్ఐ మాట్లాడి పలు సూచనలు చేశారు.

భగవద్గీత పోటీలకు 16 మందికి ఎంపిక

నరసన్నపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్మయమిషన్- చిన్మయ సుగుణం ఆశ్రమంలో స్వామి పరాత్మానంద ఆధ్వర్యంలో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదివే విద్యార్థులకు నిర్వహించిన భగవద్గీత 15వ అధ్యాయంపై ఆదివారం జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. 120 మంది విద్యార్థులు పాల్గొనగా 16 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 9 నుంచి కడపలో జరిగే ఈ పోటీల్లో వీరు పాల్గొనున్నట్టు స్వామి పరాత్మనంద తెలిపారు. కార్యక్రమంలో ఉన్న రంగనాథ్, ఉన్న సోమేశ్వరరావు, పొట్నూరు శ్రీనివాసగుప్త, పి.రమేష్, కెఎల్ఎన్ మూర్తి, తంగుడు శ్రీధర్, డి.రమేష్, కూన పులి, వెంకటేశ్వర్లు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు ఐతమ్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): టెక్కలి సమీపంలోని ఐతమ్ కళాశాలలో చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థులు సత్తాచాటారు. ప్రముఖ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో కళాశాలకు చెందిన 117 మంది విద్యార్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి రూ.3.6 లక్షలు ప్రారంభ వార్షిక వేతనం అందనున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ డీన్ ఎం.సంతోష్‌కుమార్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ హెడ్ శ్రీకాంత్ తదితరలు అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మికత వైపు అడుగులు వేయాలి



బైక్ ర్యాలీలో పాల్గొన్న సత్యసాయి ట్రస్టు సభ్యులు

కాశీబుగ్గ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో యువత ఆధ్యాత్మిక వైపు అడుగులు వేయాలని సత్యసాయి ట్రస్టు జోనల్ ఇన్‌చార్జి బైరాగి, సత్యసాయి విద్యావిహార్ చైర్మన్ మల్లా రామేశ్వరావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గ సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయి బాబా 100వ జయంతి వేడుకలు సందర్భంగా కాశీబుగ్గ సత్యసాయి మందిరం నుంచి పలాస సత్యసాయి మందిరం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. సత్యసాయి మందిర ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూడిలంక రోడ్డుకి భూమిపూజ

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పూడిలంక గ్రామానికి వేసే గ్రావెల్‌రోడ్డుకు ఆదివారం పూజ చేశారు. ఎప్పుడూ గ్రామం చుట్టూ ఉన్న ఉప్పుటేరు ప్రభావంతో జలదిగ్బంధంలో ఉండే ఆ గ్రామస్థులకు కొత్తగా గ్రావెల్ రోడ్డుతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో కూటమి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రహదారితో పాటు వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ముందుగా పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేశారు. ఇన్నాళ్లూ పడవపై బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేసే ఈ గ్రామస్థులు, ఇప్పుడు గ్రామానికి ద్విచక్ర వాహనంతో వెళ్తుండడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వందల ఏళ్ల నాటి కల ఇప్పుడు నెరవేరుతుండడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పక్కా రోడ్డు పనులు పూర్తయిన వెంటనే నాయకులను పిలిచి గ్రామంలో సంబరాలు నిర్వహిస్తామని ఆ గ్రామస్థులు చెబుతున్నారు.

జర్మనీలో ఉద్యోగాలకు దరఖాస్తులు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఐఈఎస్ సంస్థల సహకారంతో జర్మనీలో ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల ఐటీఐ, లేదా మూడేళ్ల ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో ఉత్తీర్ణత, గరిష్టంగా 30 ఏళ్ల వయసు, కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు 91829 43285 ఫోన్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

హరిపురం,అక్టోబరు26 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడార్సింగి పంచాయతీ పరిధి సవరపద్మపురంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు దగ్ధమయ్యాయి. నిరాశ్రయులైన బాధిత కుటుంబాలను మందస మండల టీడీపీ నాయకులు పరామర్శించి ఓదార్చారు. తక్షణ సాయం కింద బియ్యం, నిత్యవసర సరుకులు అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు, సంతోష్, తమిరి భాస్కరరావు, చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్‌ప్లాంట్ ప్రతిపాదనను విరమించాలి

సరుబుజ్జిలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): థర్మల్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే పోరాటం మరింత ఉధృతం చేస్తామని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ వాబ యోగి అన్నారు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలోని వెన్నెలవలస, అద్దారిపేట, బొమ్మిక, చీడివలస, తిమడాం గ్రామాల్లో థర్మల్ ప్లాంట్ వల్ల కలుగు అనర్థాలపై ఆదివారం ప్రచారం నిర్వహించారు. సోమవారం ఉదయం 11 గంటలకు ధర్నా, నిరసన ఉంటుందన్నారు. సమావేశంలో పోరాట కమిటీ కార్యదర్శి సింహాచలం, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మిన్నారావు, బాబూరావు, రమేష్, సవర ధర్మారావు పాల్గొన్నారు.

పంచారామ శైవ క్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు

అరసవల్లి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మొదటి సోమవారం రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన పంచారామ శైవక్షేత్రాలను దర్శించుకునేందుకు ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సు బయలుదేరింది. ఈ బస్సుకు 1వ డిపో మేనేజర్ అమరసింహుడు జెండా ఊపి ప్రారంభించారు. కార్తీక మాసంలో రానున్న ఆదివారాల్లో మరిన్ని బస్సులు నడపనున్నట్లు తెలిపారు. తొలి బస్సుకు మంచి ఆదరణ లభించిందని, సీట్లన్నీ పూర్తయి పోయాయన్నారు. భక్తులు ఆన్‌లైన్ ద్వారా కూడా టిక్కెట్లు పొందవచ్చని, ప్రత్యేకంగా బస్సు కావాలనుకుంటే, బస్సును వారి ఇంటి వద్దకే పంపిస్తామన్నారు. 2వ డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ, డిపో అసిస్టెంట్ మేనేజర్లు, స్టేషన్ మేనేజర్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో సమస్యల కూత

(ఐదో పేజీ తరువాయి)

కుటుంబ సభ్యులు మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైళ్ల సమాచారాన్ని తెలుసుకునేందుకు డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి నెలలు గడుస్తున్నా ఇంకా వినియోగంలోకి రాలేదు. ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాంలో చల్లని నీరు తాగేందుకు ఫ్రిజ్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ గ్లాస్ కూడా ఉంచకపోవటంతో చేతులతోనే ప్రయాణికులు నీరు తాగుతున్నారు. రెండో ప్లాట్‌ఫాంలో ఉన్న ఫ్రిజ్‌లు మూలకు చేరాయి. ఇక్కడ ఉన్న మరుగుదొడ్డికి నిత్యం తాళం వేసి ఉంటుంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ నెల 23న ఖుర్దా డివిజన్ ఏసీఎం అవిక్ కుమార్ గైన్ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌ను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు, రైల్వే సిబ్బందికి సూచించారు.

తిలారు, ఉర్లాంలో..

నరసన్నపేట నియోజకవర్గం పరిధిలో తిలారు, ఉర్లాం రైల్వేస్టేషన్లు ఉన్నాయి. నరసన్నపేట, జలుమూరు, సారవకోట, పాతపట్నం మండలాలకు చెందిన ప్రజలు ఎక్కువగా తిలారు రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఉర్లాం స్టేషన్ నుంచి నుంచి విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వంటి పట్టణాలకు, ఇటువైపు పలాస, ఇచ్ఛాపురం, పూరి వరకు ప్రయాణాలు చేస్తుంటారు. తిలారు రైల్వే స్టేషన్‌లో ఇటీవల టిక్కెట్ బుకింగ్ గదులను నూతనంగా నిర్మించారు. ప్లాట్‌ఫాంపైన కొంత భాగం మాత్రమే రేకులు వేశారు. దీంతో వర్షానికి, ఎండకు ప్రయాణికులు చెట్ల కింద నిరీక్షించాల్సి వస్తుంది. కుళాయిలు, మరుగుదొడ్లు ఉన్నా నీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్ల గదులకు తాళాలు వేసి ఉంటాయి. ఈ స్టేషన్‌లో విశాఖ డీఎంయూ, విశాఖ, పూరి- తిరుపతి, గుణుపుపూర్ ఎక్స్‌ప్రెస్, ఈఎంయూ, ఇంటర్ సిటీ మాత్రమే ఆగుతాయి. బరంపురం - విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి తదితర ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్ సర్వీసులకు హాల్ట్ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

● ఉర్లాం రైల్వేస్టేషన్‌లో పాసింజర్ రైళ్లు, గుణుపూర్ ఎక్స్‌ప్రెస్‌కు మాత్రమే హాల్ట్ ఉంది. ఇక్కడ ప్లాట్‌ఫాం అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడే ఎగుడుదిగుడుగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సౌకర్యం లేదు. మరుగుదొడ్లు లేక అత్యవసర వేళ ప్రయాణికులు బయటకు పరుగులు తీయాల్సి వస్తుంది. కనీసం క్యాంటీన్ సదుపాయం కూడా లేదు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

సంతబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ కారణంగా ఈనెలాఖరు వరకు మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని భావనపాడు మెరైన్ సీఐ డి.రాము కోరారు. ఈమేరకు తీరప్రాంత గ్రామాల్లో పర్యటించి అప్రమత్తం చేశారు. తుఫాన్ ప్రభావం తగ్గేవరకు పర్యాటకులు బావనపాడు బీచ్‌కు రావద్దని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది వెంకటరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మ రక్షణకు కృషి

సంతబొమ్మాళి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా గౌరవధ్యక్షుడు లోకనాథం ఆనందరావు, జిల్లా సహాయ కార్యదర్శి బాడాన శేఖర్ అన్నారు. ఆదివారం సంతబొమ్మాళిలో మండల విశ్వహిందూ పరిషత్ సమావేశం జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులు రట్టి పెరుమాళ్లు, గణపతిరావు, మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, మేఘవరం ఎంపీటీసీ సూరాడ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పోటీలు విజయవంతం చేయాలి

మెళియాపుట్టి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ పోటీలను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.చంద్రమౌళి తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమపేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

టెక్కలి, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికలు, పోస్టుమెట్రిక్ వసతిగృహ విద్యార్థులకు ప్రసూతి వైద్యుల సంఘం ఆధ్వర్యంలో కౌమారదశలో ఉన్న విద్యార్థులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ అరవింద్, డాక్టర్ ధనలక్ష్మి విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు హెల్త్‌కార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంతి ఐటీడీఏ డీఈఈ వల్లభ మల్లయ్య, వసతిగృహ సంక్షేమాధికారి సునీత పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

● సోంపేట, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మంగరాజు తెలిపారు. బారువ ఎస్ఐ హరిబాబునాయుడితో కలిసి బారువ కొత్తూరు, వాడపాలేం గ్రామాలను ఆదివారం సందర్శించారు.

● ఇచ్ఛాపురం: తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మీసాల చిన్నమనాయుడు సూచించారు. ఆదివారం డొంకూరు తీర ప్రాంతాన్ని సందర్శించి పలు సూచనలిచ్చారు.

● వజ్రపుకొత్తూరు: తీరపాంతంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. తుఫాన్ నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు.

● హిరమండలం: లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటేష్ అన్నారు. ఆదివారం జిల్లోడిపేట, తుంగతంపర తదితర నదీ తీర గ్రామాలను ఆయన సందర్శించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. తంగతంపర గ్రామం వద్ద వంశధార వరదగట్టును పరిశీలించారు.

● హరిపురం: తుఫాన్ పట్ల తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్, డీటీ రామకృష్ణ కోరారు. మందస మండలం బేతాపురం, గెద్దూరు, గంగువాడ గ్రామాల్లో వారు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

● మెళియాపుట్టి: మూడురోజులపాటు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

● సంతబొమ్మాళి: మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని ఎస్ఐ వై.సింహాచలం తెలిపారు. గెద్దలపాడులో ప్రజలకు అవగాహన కల్పించారు.